పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

అచ్చంపేట పురపాలికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుక్కల బెడద నివారిస్తామని.. పది రోజుల్లో ప్రతి కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చూస్తామని అన్నారు. సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్య సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పట్టణంలో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా.. ఆయన ఓపిగ్గా సమాధానమిచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

– అచ్చంపేట



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

- కుక్కల బెడద నివారిస్తాం
- ప్రతి కాలనీలో వీధిలైట్లు వెలిగేలా చూస్తాం
- మల్లంకుంటలో మురుగు కలవకుండా డ్రెయినేజీ ఏర్పాటు
- మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

ప్రశ్న: మల్లంకుంటలో మురుగు కలిసి కంపుకొడుతుంది. చెరువు కట్టపై కంపచెట్లు ఏపుగా పెరగడంతో పాటు మాంసం, చేపల వ్యర్థాలు వేస్తున్నారు. కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తూ పిల్లల వెంట పడుతున్నాయి. పోస్టాఫీస్ వెనక భాగంలోనూ అదే పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

– మండికారి బాలాజీ, జగదీశ్వర్‌గౌడ్ 14వ వార్డు, అరవింద్, సాయినగర్ కాలనీ

కమిషనర్: మల్లంకుంటలో మురుగు కలువకుండా ప్రత్యేక డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం. చెత్త సేకరణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తున్నాం. మాంసం ఇతర వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా చూస్తాం. కట్టపై కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగిస్తాం. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుపై నీళ్లు నిలుస్తున్నాయి. చుట్టుపక్కల వారు అక్కడే చెత్త వేస్తున్నారు. దోమల బెడద అధికంగా ఉంది.

– గోవర్ధన్‌రెడ్డి, అచ్చంపేట

కమిషనర్: రోడ్డు లెవల్ తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందిగా ఉంది. కాల్వకు రంధ్రం ఏర్పాటుచేసి వర్షపునీరు అందులోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తాం. అవసరమైతే జరిమానాలు విధిస్తాం.

ప్రశ్న: పట్టణంలో కుక్కలతో అవస్థలు పడుతున్నాం. పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నాయి. సీసీరోడ్లు నిర్మించాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

– శ్రీధర్, 1వ వార్డు, మగ్దూమ్, వెంకటేశ్వరకాలనీ, మారుతి, టీవీ టవర్

కమిషనర్: :గతంలో కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతానికి తరలించాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పది రోజుల్లో కుక్కల బెడద తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీలను శుభ్రం చేయిచడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపడుతాం.

ప్రశ్న: పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లు, మటన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, నాణ్యతను పరిశీలించాలి. పార్కింగ్ సమస్య పరిష్కరించాలి.

– మోహన్‌రెడ్డి, శ్రీరాంనగర్ కాలనీ

కమిషనర్: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని ప్రతి మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనఖీ చేస్తాం. నాణ్యమైన మటన్ విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. పందుల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. పార్కింగ్ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తాం.

ప్రశ్న: ఆర్టీసీ బస్టాండ్ నుంచి వచ్చే మురుగుతో దుకాణాల్లో ఉండలేక పోతున్నాం. ఇన్ గేట్ వద్ద కొత్త కల్వర్టు ఏర్పాటుచేస్తే ఇబ్బందులు తీరుతాయి. బస్టాండ్ ఎదుట ఏఆర్ రెడ్డి చికెన్ సెంటర్ పక్క రోడ్డు గుంతలమయంగా మారింది. వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– నారాయణ, ప్రకాష్, బాలాజీ, కొత్తబస్టాండ్ ఏరియా

కమిషనర్: డ్రెయినేజీ, ఇతర వాటి కోసం ప్రత్యేకంగా ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ వారికి ఇది వరకే సూచించాం. కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి, మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశాం. గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలించి, మరమ్మతు చేయిస్తాం. చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. నెలరోజులుగా వీధిలైట్లు పడటం లేదు.

– నరేందర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్, విద్యానగర్ కాలనీ

కమిషనర్: మురుగు కాల్వలను వెంటనే శుభ్రం చేయిస్తాం. వీధిలైట్లు వేయిస్తాం.

ప్రశ్న: మారుతీ నగర్ లక్ష్మి టాకిస్ వెనకిభాగంలో కొన్ని ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు.

– జయమ్మ, మారుతీ నగర్

కమిషనర్: మిషన్ భగీరథ తాగునీరు రాని ప్రాంతాలకు కొత్త పైపులైన్ నిర్మిస్తాం. సమస్య పరిష్కరిస్తానికి తక్షన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ట్రెండ్స్ ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం వేయకుండా చూడాలి.

– గణేష్, శ్రీనగర్ కాలనీ

కమిషనర్: ఇసుక మేటలను తొలగించి రోడ్డును శుభ్రం చేయిస్తాం. పట్టణ ప్రజలు మురుగు కాల్వల్లో చెత్తాచెదారం వేయవద్దు. ఇంటింటికి వచ్చే చెత్త బండిలో వేయాలి.

క్లుప్తంగా

పొలాల్లో మట్టి నమూనా సేకరణ



పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, ఎంగంపల్లితండాలో శనివారం వ్యవసాయ అధికారులు, ఏఈఓ గోవిందు రైతుల పొలాల్లో మట్టి నమూనా సేకరణ చేపట్టారు. ఏఈఓ మాట్లాడుతూ పలు గ్రామాలలో దాదాపు 50కి పైబడి నమూనాలు సేకరించామని, వీటన్నింటిని భద్రపరిచి జడ్చర్లలోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

ఎంపీఓగా బాధ్యతలు

తాడూరు: మండల పంచాయతీ అధికారిగా బ్రహ్మచారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీఓగా ఉన్న లక్ష్మణ్‌నాయక్ ఊరుకొండకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తిమ్మాజిపేటలో ఎంపీఓగా విధులు నిర్వహించిన బ్రహ్మచారి మండలానికి వచ్చారు.

పశువైద్యాధికారి బదిలీ

ఉప్పునుంతల: మండల పశువైద్యాధికారి నరేందర్ సాధారణ బదిలీల్లో రంగారెడ్డి జిల్లా సీతారాంబాగ్‌కు వెళ్లారు. ఈమేరకు శనివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో మండలంలోని వెల్టూరు పశువైద్యాధికారి దీప్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వెళ్లిన డాక్టర్ నరేందర్ ఇక్కడ 13 ఏళ్లుగా పశువైద్యాధికారిగా విధులు నిర్వర్తించారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్

పెద్దకొత్తపల్లి: వెనచర్లలో 11 మంది దివ్యాంగులు, 40 మంది వృద్ధులుకు, నడవలేని వారికి పంచాయతీ కార్యదర్శి నాగేషు ఇళ్ల వద్దకు వెళ్లి వారికి పింఛన్ డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో కారోబార్ భాస్కరాచారి, సిబ్బంది వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాలలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత మరిచిపోరాదని ఏపీఓ చంద్రసిద్ధార్థ తెలిపారు. శనివారం మండలంలోని యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, ఎత్మాతాపూర్‌లో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలచే గుంతలు తవ్వించారు. వర్షాలు కురుస్తున్న కారణంగా ముందుగా గుర్తించిన ప్రదేశాలలో తీసిన గుంతలలో మొక్కలు నాటాలన్నారు.

కొత్తపీర్ల పండుగ ప్రారంభం

చారకొండ: మండలంలోని జూపల్లిలో శుక్రవారం రాత్రి కొత్త పీర్లపండుగ ప్రారంభమైంది. ఈ సందర్భంగా చావిడిలో పీర్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 29న పెద్ద సరిగెత్తు, 30 బాయికి ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడాలి

వెల్దండ: ముదిరాజ్ కులస్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్య శనివారం హైదరాబాద్‌లోని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బుర్ర జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో ముదిరాజ్ కులస్తులు మత్స్యకార వృత్తితో జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు, వాహనాలు అందించాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ- డీ నుంచి బీసీ- ఏలో చేర్చి పిల్లల భవిష్యత్ సహకరించాలన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం కంప్యూటర్ శిక్షణ ప్రారంభించారు. రోటరీక్లబ్ సైబరాబాద్ వారు పాఠశాలకు మూడు కంప్యూటర్లను వారం రోజులు క్రితం అందించారు. పాఠశాల హెచ్ఎం బాలు మాట్లాడుతూ విద్యార్థులక కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలనే సంకల్పంతో శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

వెల్దండ: ప్రభుత్వం మొదటి విడతలో అందిస్తున్న రుణమాఫీలో రైతులకు ఎలాంటి షరతులు లేకుండా నేరుగా రైతు ఖాతాలో రూ.లక్ష డబ్బులు వేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రుణమాఫీలో కుట్రచేసి రైతులకు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలి



సీఎంకు పంపిస్తున్న లేఖను చూపుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేసి, తాను పుట్టినగడ్డ రుణం తీర్చుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. ఆదివారం కల్వకుర్తి పర్యటనకు సీఎం వస్తున్న సందర్భంగా శనివారం లేఖ పంపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుకోలేదని అన్నారు. అచ్చంపేటలో పేపర్ పరిశ్రమ, కొల్లాపూర్‌లో సున్నపు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరిచి యువతకు ఉపాధి కల్పించాలన్నారు.

కల్వకుర్తికి నిధులు కేటాయించండి

కల్వకుర్తిరూరల్: పుట్టిన గడ్డపై ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి కల్వకుర్తికి వస్తున్న రేవంత్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్వకుర్తి ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి, రైల్వేలైన్ కోసం కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరు లైన్‌ల రహదారి నిర్మించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. రైల్వే లైన్ కోసం ల్యాండ్ అక్విజేషన్ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు జిల్లాల పునర్విభజన మార్పులు, చేర్పులు చేస్తే 16 మండలాలతో కొత్త జిల్లాగా కల్వకుర్తిని ప్రకటించి జైపాల్‌రెడ్డి పేరు జిల్లాకు పెట్టాలన్నారు. దుర్గాప్రసాద్, శేఖర్‌రెడ్డి, మంగ్యానాయక్, బాలస్వామి, శేఖర్‌రెడ్డి, నర్సింహ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచారి

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



అచ్చంపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: దివంగత అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీశంకర్, మహబూబ్‌అలీ, ఖాజా, మైనోద్దీన్, రఫీ, నాయకులు పాల్గొన్నారు.

మన్ననూర్: అబ్దుల్‌కలాం వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఓం చౌరస్తాలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

కొల్లాపూర్: అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత ముందుకుసాగాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్ఐడీ జూనియర్ కళాశాలలో వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

30న చలో హైదరాబాద్

నాగర్‌కర్నూల్‌రూరల్: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, జీఓ నంబర్ 51ని సవరించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 30న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మంతటిలో నిరసన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, బాలస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.

3, 4న శిక్షణ తరగతులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో ఆగస్టు 3, 4 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరై శిక్షణ ఇస్తారని అందరూ తరలిరావాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అల్లాపూర్‌లో బీసీ, ఎస్సీ వార్డులలోని డ్రెయినేజీలను పరిశీలించి పరిశీలించి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు అందుబాటులో లేరని ఇద్దరికి గాను ఒక్కరే ఆస్పత్రికి అప్పుడప్పుడు వస్తుంటారని తెలిపారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

బల్మూర్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బాణాల ఆశ్రమ పాఠశాల, కొండనాగులలోని బీసీ, ఎస్టీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. బాణాల మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం పర్యటనతో ఆంక్షలు


కల్వకుర్తి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నిమిత్తం మున్సిపాలిటీలో పలు ఆంక్షలు విధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ శనివారం తెలిపారు. మున్సిపాలిటీలో ఆదివారం సంత, ఇతర వ్యాపారాలు రోడ్లపైనే జరుగుతుంటాయి. సీఎం పర్యటనను దృష్టిలో ఉంచుకొని ప్రజలెవరూ రోడ్లపైనే వ్యాపారాలు చేయరాదని, సీఎం పర్యటించే ప్రాంతాలలో ఇప్పటికే వ్యాపారస్తులందరికీ ముందుగానే తెలియజేశామని చెప్పారు. రోడ్లపై టిఫిన్ సెంటర్లు, పండ్ల వ్యాపారాలు చేసుకునే వారు ఆదివారం నిర్వహిస్తే చట్టపరంగా వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించండి



ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకోసం ప్రభుత్వ స్థలాన్ని చూపాలని గ్రామస్తులు, రైతులు శనివారం తహసీల్దార్ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ లోఓల్టేజీ, కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసుకోనున్నామని వారు తెలిపారు. శ్రీనివాసులు యాదవ్, శేఖర్‌రెడ్డి, తిర్పతయ్యయాదవ్, రామస్వామి, రామకృష్ణ, నరేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం



కోడేరు: మండలంలోని నాగులపల్లితండా, నార్యనాయక్‌తండా, ములమాలపుతండాల్లో శనివారం ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శారద ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 10 లీటర్ల సారా పట్టుకున్నారు. నార్యనాయక్‌తండా నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆరు లీటర్లు సారా తరలిస్తుండగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు.

అచ్చంపేటలో గట్టి నిఘా

అచ్చంపేట రూరల్: వరుస చోరీల నేపథ్యంలో పట్టణంలో గట్టి నిఘా ఏర్పాటు చేశామని సీఐ రవీందర్, ఎస్ఐ రాములు తెలిపారు. శనివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు చౌరస్తాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. 20 మంది పోలీసు సిబ్బంది రాత్రిళ్లు గస్తీ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ.. నంబర్ ప్లేటు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను పూర్తి చేయండి

తెలకపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో పాఠశాలల ఫొటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా ప్రతి రోజు ఉదయం విద్యార్థుల హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయు లు తమ పాఠశాలలో తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా బోధించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు ఆర్థికసాయం



ఆర్థికసాయం పొందిన విద్యార్థులతో మిత్ర-85 సభ్యులు, కళాశాల సిబ్బంది

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులకు పట్టణానికి చెందిన మిత్ర-85 సభ్యులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులు వారందరికి కలిపి రూ.75వేలు అందించారు. ఉన్నత విద్యను చదివి పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని, చదువుకు పేదరికం అడ్డుకాకూడదని సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు, మిత్ర-85 సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి నష్ట పరిహారం అందజేత

మన్ననూర్: పెద్దపులి దాడిలో పాడి ఆవు మృతి చెందిన ఘటనలో మేడిమల్కల చెంచుపెంటకు చెందిన నల్లపోతుల గురువయ్యకు అటవీశాఖ తరుపున శిక్షణ ఏఎఫ్ఎస్ సుశాంత్ రూ.12 వేలు నష్ట పరిహారంగా శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పశువులు అటవీ ప్రాంతానికి మేత కోసం వెళ్లే క్రమంలో పెద్దపులి, చిరుత దాడి చేసి చంపితే బాధితులకు నష్ట పరిహారం అందజేస్తున్నామని తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులకు హాని తలపెడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఈశ్వర్, ఎఫ్ఎస్ఓ రామాంజనేయులు, బీఎఫ్ఓలు బాబలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న శిక్షణ ఏఎఫ్ఎస్ సుశాంత్

డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద వసతులు కల్పించండి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీ ప్రజలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రజలకు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి వసతులు కల్పించకుండా అధికారులు వదిలేశారని తెలిపారు. 152 ఇళ్లకు ఒక్కటే బోరు ఉందని, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్ల కనెక్షన్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఇళ్ల వరకు బీటీ రోడ్డు వేయాలని, విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సైదులు, పెంటమ్మ, అరుణ, ఆరిఫా, లింగమ్మ, షబానా, శాంతమ్మ, సువర్ణ, పార్వతమ్మ, అనిత, రాములు, కవిత, కృష్ణయ్య, రవీందర్‌గౌడ్, రామనాథం పాల్గొన్నారు.

సమాజసేవకు దోహదపడాలి



అన్నదానం ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్ నాగజ్యోతి

నాగర్‌కర్నూల్: భగవాన్ సత్యసాయి బాబా సూచించిన మాటల్లోనే సాయి సంస్థ, సాయి సేవాదళ్, యువత సాయి భక్తులు సమాజ సేవకు దోహదపడాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర మహిళా యూత్ కోఆర్డినేటర్ నాగజ్యోతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సత్యసాయి షిరిడీ సాయి మందిరంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు 120 నుంచి 200 మంది రోగుల సహాయకులకు మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హకీం మురళీ, ఎలిమే ఈశ్వరయ్య, బాలకృష్ణ, యువత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని 19వ వార్డులో ఆరు నెలల క్రితం మోటార్ చెడిపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం వార్డులో పర్యటించి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గీత, అశోక్, నిరంజన్, శ్రీశైలం, మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో ప్రజలు వివిధ సమస్యలతో సతమతం అవుతున్నా పంచాయతీ వారు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శంకర్‌నాయక్ ఆరోపించారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. శనివారం నార్లాపూర్‌లో నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్డు లేదని, వెంటనే వేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు.

లింగాల చేరుకున్న కేఎల్ఐ నీరు



లింగాల: వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తుండడంతో వానాకాలం పంటలకు సాగునీటికై రైతులు ఆలోచన చేస్తుండగా ఎట్టకేలకు శనివారం గుడిపల్లి రిజర్వాయర్ ద్వారా కేఎల్ఐ కాల్వలకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ఈ వానాకాలంలో చెరువులు, కుంటలకు నామ మాత్రంగా నీరు చేరడంతో మాగాణి పంటలకు సాగునీరు గురించి రైతులు ఆలోచనలో పడ్డారు. వరిని నాటేందుకు తూకాలు పోసుకున్న రైతులు నారు ముదురు పోతుందని భయపడ్డారు. కేఎల్ఐ కాల్వల ద్వారా చెరువులు, కుంటలకు నీరు చేరితేనే మాగాణి పంటలకు ఆసరగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆయా గ్రామాలను కలుపుతూ ఉన్న కాల్వలన్నింటికి నీటి సరఫరా జరిగేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని, కాల్వలో పెరిగిన చెట్ల పొదలను తొలగించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.